సాక్షి
కుమురం భీం

శనివారం । 18 । అక్టోబర్ । 2025



చూసొద్దాం.. తుర్కం చెరువు

నల్దుర్తి తుర్కం, వెంగన్న చెరువులు ఎకో టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. వీటి అందాలను తిలకించేందుకు అటవీశాఖ అవకాశం కల్పించింది. IIలో▸



అందని పశువైద్యం IIIలో▸

లింగాపూర్ మండలంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. గ్రామాల్లో పశువులు గాలికుంటు, లంపీస్కిన్ తదితర వ్యాధుల బారినపడుతున్నాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

'నేటి బీసీ బంద్ జయప్రదం చేయండి'



విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులను బంద్‌కు మద్దతు కోరుతున్న బీసీ జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన తెలంగాణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ రూప్‌నార్ రమేశ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని వ్యాపారులు, కుల సంఘాల నాయకులు, ఆర్టీసీ అధికారులను కలిసి బంద్‌కు సహకరించాలని విన్నవించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించని వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ నేటి బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్, జేఏసీ నాయకులు యాదగిరి, లవు కుమార్, నాగోసె శంకర్, షేక్ అసద్, మారుతి, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రమ' టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న శాంతికుమారి

కెరమెరి: ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ(మోడి)లను ఆమె సందర్శించారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, సీఆర్‌టీలకు ప్రతీనెల 1వ తే దీన వేతనాలు చెల్లించాలని, ఎంటీఎస్ వర్తింపజేస్తూ హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల తనిఖీల కోసం అధికా రులు ఉండగా మళ్లీ పర్యవేక్షణ నిమి త్తం తని ఖీ అధికారులను నియమించ డం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల సిబ్బంది సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల వినియోగం, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకునే సందర్భంలో ఏవైనా సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించడంతో పాటు టోల్ ఫ్రీ నం. 15100ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, ఏడీఏ మిలింద్‌కుమార్, రైతులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల నిరసన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న 141 మంది కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని కార్యాలయం ముఖద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయానికి వచ్చిన అధికారులను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌తో పాటు అధికారులు బయట గంటపాటు వేచి ఉన్నారు. మూడు నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, దీపావళి పండుగ నేపథ్యంలో వేతనాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ వారం రోజుల్లోగా రెండు నెలల వేతనాలను అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు సంజీవయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు..
అర్ధాకలి చదువులు!

- జూనియర్ కాలేజీల్లో అమలు కాని ఎండీఎం
- రోజంతా పస్తులుంటున్న వైనం
- అటకెక్కిన గత ప్రభుత్వ హామీ
- అమలు చేయాలని విద్యార్థుల విన్నపం



కెరమెరిలో ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. విద్యార్థులు ప్రతీరోజు కళాశాలకు వచ్చేలా ఇటీవల ఎఫ్ఆర్ఎస్ కూడా అమలు చేసింది. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుల కోసం మండల కేంద్రాలకు వస్తున్న ఇంటర్ విద్యార్థులు ఖాళీకడుపులతో అలమటిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కాకపోవడంతో విద్యార్థులు రోజంతా పస్తులుండాల్సిన పరిస్థితి ఉంది. జూనియర్ కళాశాలలు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నాయి. కళాశాలకు వచ్చే కొందరు విద్యార్థులు అప్పుడప్పుడు లంచ్ బాక్సు తీసుకొస్తుండగా, మరికొందరు ఉదయం ఇళ్ల వద్దే భోజనం చేసి వస్తున్నారు. బాక్సు తెచ్చుకోని విద్యార్థులు కళాశాల ముగిసే వరకు ఆకలితో ఉంటున్నారు. దీంతో అధ్యాపకులు చెప్పే పాఠాలు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 4,625 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఏటా తగ్గుతున్న విద్యార్థులు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎండీఎం అమలు చేయాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని నిర్ణయించారు. మధ్యాహ్న భోజనం అమలుకు ఎంత ఖర్చవుతుందనే వివరాలు సైతం సేకరించారు. కానీ పథకం అమలు మాత్రం జరగలేదు. ఏ ప్రభుత్వం కూడా విద్యార్థుల వినతులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎండీఎం అమలు కాక ఏటా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

చిరుతిండ్లతో సరి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో చాలా వరకు పేద విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్నం విరామంలో స్నాక్స్, పండ్లు, టీ, కాఫీలతో తమ ఆకలిని కొంత వరకు తీర్చుకుంటున్నారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే ఎంతో మంది పేద విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

గతంలో మూడు నెలలు..

2020 -21 విద్యాసంవత్సరంలో అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జనవరి నుంచి మార్చి వరకు కలెక్టర్ నిధులతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అలాగే 2022 -23లో అప్పటి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డీఎంఎఫ్‌టీ నిధులతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జనవరి నుంచి మార్చి వరకు వార్షిక పరీక్షల నేపథ్యంలో మధ్యాహ్న భోజనాన్ని అందించారు. సిర్పూర్(టి) మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సైతం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎవరూ కూడా కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పంపిణీ చేయలేదు.

జిల్లాలోని జూనియర్ కళాశాలల వివరాలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు:	ఫస్టియర్ విద్యార్థులు:	సెకండ్ ఇయర్ విద్యార్థులు :
11	1960	1557
ఒకేషనల్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు: 617	ఒకేషనల్ సెకండ్ ఇయర్ విద్యార్థులు : 491	

వంట కావడం లేదు



ఇంటి నుంచి బయలు దేరే సమయానికి ఇంట్లో వంట కావడం లేదు. దీంతో ఖాళీ కడుపుతోనే కళాశాలకు వస్తున్నా. మధ్యాహ్నం కూడా భోజనం లేకపోవడంతో పగలంతా ఉపవాసం ఉండి మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లాక భోజనం చేస్తున్నా. టిఫిన్ బాక్స్ తెచ్చుకోలేని విద్యార్థులందరికీ ఇబ్బంది అవుతోంది.

– గుర్నులే శిరీష, ఎంపీసీ, ఫస్టియర్, సుర్దాపూర్

ఏకాగ్రత ఉండడం లేదు



కాలేజీకి టిఫిన్ బాక్స్ తెచ్చుకోలేని సందర్భంలో తోటి స్నేహితుల వద్ద ఉన్న బాక్స్ షేర్ చేసుకుంటున్నాం. దీంతో అది ఎవరికి సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నాం. కడుపులో ఆకలిగా ఉండడంతో చదువులో ఏకాగ్రత నిలుపలేకపోతున్నా. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి.

– సెందే అనసూయ, సీఈసీ, ఫస్టియర్, వాడిగూడ

ఎలాంటి ఆదేశాలు లేవు

సుదూరం నుంచి వస్తున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే పథకం అమలు చేస్తాం.

– రాందాస్, డీఐఈవో

విజన్ 2030తో గిరిజనుల సంక్షేమం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: విజన్ 2030తో జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కర్మయోగి అభియాన్' జాతీయ సదస్సులో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి మండలం లింబుగూడ ప్రాంతంలోని బహుళార్థక ప్రయోజన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు వైద్యం, విద్య, పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ కుటుంబాలకు అధునాతన పరికరాలతో నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. గిరిజన పిల్లల మానసిక ఎదుగుదలకు అవసరాలను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించడంతో పాటు ఉపాధి పొందేందుకు అవసరమైన శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులు, సమావేశాలు, సాంస్కృతిక కూటములతో గిరిజనుల మధ్య సత్సంబంధాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పట్టేలా చిత్రాలను రూపొందించడంతో పాటు పురాతన లోహపు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తుందన్నారు. సమావేశంలో జైనూర్ ఏటీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్: జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్(వానాకాలం) సీజన్ వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. జిల్లాలో 44వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, దాదాపు 30వేల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్నారు. ఈనెల 24లోగా 40 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం రూ.2,369 మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమ శాతం నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు.కొనుగోలు కేంద్రాలను ఎత్తుప్రదేశంలో ఏర్పాటు చేయాలని, సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసి గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయ్యర్లు, తేమశాతం యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ట్యాబ్‌లను అందుబాటులో ఉంచి, రైతుల వద్ద నుంచి క్రమపద్ధతిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం ట్యాగింగ్ చేసిన రైస్‌మిల్లులకు మాత్రమే తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకునే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టాలి'



మాట్లాడుతున్న దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలలో విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జైనూర్, సిర్పూర్, లింగాపూర్, తిర్యాణి, కెరమెరి ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈవోలు ప్రతీ పాఠశాలను సందర్శించి హాజరు శాతంపై ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, ఎస్‌వో అబిద్ అలీ, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరంపై కక్ష కడుతారా..!



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

- ఏపీ సర్కారు తీరు సరికాదు..
- 'సాక్షి'పై దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



ఆసిఫాబాద్‌అర్బన్: అక్షరంపై కక్ష కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రమాదంలో పడేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. అధికారం చేతిలో ఉందని ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి'పై అక్కసు చూపిస్తున్నారు. వార్తలకు భయపడి పత్రిక గొంతు నొక్కాలని శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఖాకీలతో సర్కారు చేయిస్తున్న దమన కాండపై జిల్లాలోని జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వీటికి పలు జర్నలిస్టు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

కక్ష సాధింపు సరికాదు..

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 'సాక్షి' యాజమాన్యంపై అవలంబిస్తున్న కక్ష సాధింపు ధోరణి సరికాదని టీయూడబ్ల్యూజే టీయూడబ్ల్యూ (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, సీనియర్ జర్నలిస్టులు రావుల శంకర్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్‌రావులు మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టి వేధించడం తగదన్నారు. ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవని, ఇప్పటికైనా సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో జర్నలి స్టుల సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందో ళన కార్యక్రమాలు చేపడతామని కూటమి ప్ర భుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు ప్రకాశ్‌గౌడ్, శ్రీధర్, జానకీరాం, సురేశ్‌చారి, హనుమయ్య, రాధాకృష్ణచారి, తాటిపల్లి ఆశిష్, ముబ్బషీర్, శ్రీకాంత్, మహిళా జర్నలిస్టు గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

మీడియా గొంతు నొక్కడమే..



సాక్షి దినపత్రిక కు పదేపదే నోటీసులు ఇస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అంటే మీడియా గొంతు నొక్కడమే. వార్తలు రాస్తే కేసులు పెట్టడం సిగ్గుచేటు. ఒక్క కేసులో 4, 5 నోటీసులు జారీ చేయడం సమంజసం కాదు. వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. సాక్షి దినపత్రిక యాజమాన్యంపై, జర్నలిస్టులపై కొనసాగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– అబ్దుల్ రహమాన్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం తగదు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి. ఇలాంటి ఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిది. జర్నలిస్టులపై కేసులు పెట్టి వేధించాలని చూడడం మంచి పద్ధతి కాదు. భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం.

– గణపురం మహేశ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు

అక్రమ కేసులు ఎత్తివేయాలి



ధనుంజయరెడ్డిని పోలీసులు వేధించడం తగదు. నోటీసులు ఇవ్వాలి తప్పా కార్యాలయాల వద్దకు వెళ్లి హంగామా చేయడం సరికాదు. ఏదైనా ఉంటే న్యాయపరంగా తేల్చుకోవాలి. కేసులు నమోదు చేసి వేధించడం ముమ్మాటికీ తప్పే. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా చూడాలి. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతాం.

– మీర్జా సలీమ్‌బేగ్, టీయూడబ్ల్యూజేఎఫ్, జిల్లా అధ్యక్షుడు

మద్యం దరఖాస్తులకు ఆఖరి రోజు

- నేటితో ముగియనున్న గడువు
- ఇప్పటివరకు జిల్లాలో 380 దరఖాస్తులు

ఆసిఫాబాద్: జిల్లాలో మద్యం టెండర్ల దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తులకు ఒక్క రోజే మిగిలి ఉంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణాలకు 380 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ. 11.40 కోట్ల ఆదాయం సమకూరింది. శుక్రవారం 165 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు ఆసిఫాబాద్ డివిజన్‌లో 215 దరఖాస్తులు, కాగజ్‌నగర్‌లో 165 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధికంగా చింతలమానెపెల్లి మండలం గూడెంషాపునకు 43 దరఖాస్తులు రాగా, వాంకిడిలోని 07వ నంబర్ షాపునకు 36, 08 నంబర్ షాపునకు 35 దరఖాస్తులు వచ్చాయి. రెబ్బెన లోని షాపు నెం.09కు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గత 20 రోజులుగా ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వ్యాపారులు దరఖాస్తు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. గతేడాది 1020 దరఖాస్తులు రాగా, ప్రభుత్వానికి రూ. 20.40కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తులకు శనివారంతో గడువు ముగియనున్నందున చివరి రోజు అధికంగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయి. కాగా గడువు పెంచే అవకాశాలు లేవని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ తెలిపారు.

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ఇలా..

	షాపు నం.	దరఖాస్తులు
ఆసిఫాబాద్	001	07
ఆసిఫాబాద్	002	14
ఆసిఫాబాద్	003	13
ఆసిఫాబాద్	004	08
ఆసిఫాబాద్	005	16
ఆసిఫాబాద్	006	13
వాంకిడి	007	38
వాంకిడి	008	35
రెబ్బెన	009	00
గోలేటి	010	01
గంగాపూర్	011	01
విజయనగరం కాలనీ	012	31
తిర్యాణి, గోయగాం(కెరమెరి)	013	31
జైనూర్	030	02
జైనూర్	031	01
సిర్పూర్(యూ)	032	03

కాగజ్‌నగర్ డివిజన్..		
కాగజ్‌నగర్	014	03
కాగజ్‌నగర్	015	02
కాగజ్‌నగర్	016	03
కాగజ్‌నగర్	017	14
కాగజ్‌నగర్	018	08
కాగజ్‌నగర్	019	10
సిర్పూర్(టి)	020	04
నజ్రూల్‌నగర్	021	19
రవీంద్రనగర్(చింతలమానెపల్లి)	022	01
కౌటాల	023	01
కౌటాల	024	06
బెజ్జూర్	025	20
పెంచికల్‌పేట్	026	02
దహెగాం	027	29
గూడెం(చింతలమానెపల్లి)	028	43
చింతలమానెపల్లి	029	01

క్లుప్తంగా

బీసీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా వంశీ


వంశీ

మంచిర్యాలఅర్బన్: బీసీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన చేరాల వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ బీసీ విద్యార్థి సంఘాల నాయకులను ఏకతాటిపై తీసుకువచ్చి విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకు ఉద్యమం చేస్తానని తెలిపారు.

పోకిరీలకు కౌన్సెలింగ్

మంచిర్యాలక్రైం: డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లాకేంద్రంలోని రాముని చెరువు పార్కు వద్ద నలుగురు పోకిరీలను శుక్రవారం అదుపులో తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు షీటీమ్ ఎస్సై హైమ తెలిపారు. మహిళల పట్ల వెకిలి చేష్టలకు పాల్పడిన నలుగురు యువకులను అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, వెకిలి చేష్టలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన వేధింపులకు గురిచేస్తే షీ టీమ్ నంబర్ 6303923700, 100 డయల్ చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. షీ టీమ్ సభ్యులు శ్రావణ్, జ్యోతి, శ్రీలతలు పాల్గొన్నారు.


తప్పుడు సర్టిఫికెట్‌తో రుణం పొందిన మహిళకు జైలు

మంచిర్యాలక్రైం: తప్పుడు కుల ధ్రువపత్రంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం పొందిన మహిళకు రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కె.నిరోష శుక్రవారం తీర్పునిచ్చారు. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని గర్మిళ్లకు చెందిన చిలుకమర్రి రాధ..ఎస్సీ కుల ధ్రువపత్రం సృష్టించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల సబ్సిడీ రుణం తీసుకుంది. ఈమేరకు రెవెన్యూ, బ్యాంక్ అధికారుల విచారణలో తేలింది. 2018 ఏప్రిల్ 19న పోలీస్‌స్టేషన్లో రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయగా రాధపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

పోలీసుల అదుపులో దొంగలు?

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో ఈనెల 15న రాత్రి చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీ కేసును సవాల్‌గా తీసుకుని ఒక్కరోజులో పట్టుకున్నట్లు సమాచారం. ఆలయంలో చొరబడి 4కిలోల 500 గ్రాముల వెండి, రెండు తులాల బంగారం, రూ.36 నగదు ఎత్తుకెళ్లారు. అందులో వెండిని వేడి చేసి కరిగిస్తుండగా పోలీసులు వారిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. అయితే అమ్మవారి ముక్కుపుడక పత్తి చేను మీదుగా వెళ్తుండగా పడిపోయిందని దొంగలు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

చూసొద్దాం.. తుర్కం చెరువు


తుర్కం చెరువు వద్ద బర్డ్‌వాచ్ చేస్తున్న పర్యాటకులు

- పర్యాటకులకు అటవీశాఖ ఆహ్వానం
- అందాలను వీక్షిస్తున్న పక్షి ప్రేమికులు

మామడ: దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న నల్దుర్తి తుర్కం, పొన్కల్ వెంగన్న చెరువులు ఎకో టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ అందాలను వీక్షించేందుకు అటవీశాఖ అవకాశం కల్పిస్తోంది. గుడారాల విడిది, వాహన సఫారీ ద్వారా చెరువుల అందాలను పర్యాటకులు, పక్షి ప్రేమకులను వీక్షించేలా ఆహ్వానం పలుకుతోంది. ప్రత్యేకంగా ప్యాకేజీలను అందుబాటులో ఉంచింది. ఈక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, శిక్షణలో ఉన్న అధికారులు పర్యటిస్తుండడంతో సందడిగా ఉంటుంది. ఈ చెరువుల వద్ద 80 రకాల పక్షి జాతులను అధికారులు గుర్తించారు. నిర్మల్ నుంచి 25 కి.మీ దూరం, దిమ్మదుర్తి నుంచి 4 కి.మీ దూరంలో ఈ ప్రాంతం ఉంది.

ప్యాకేజీలు ఇలా..

మొదటి ప్యాకేజీ: పిల్లలకు రూ.2వేలు, పెద్దలకు రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. సందర్శకులు శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు తుర్కం చెరువు వద్దకు చేరుకోవాలి. పర్యాటకులకు మధ్యాహ్నం లంచ్ అనంతరం సఫారీ నిర్వహిస్తారు. అటవీప్రాంతంలో రాత్రి క్యాంపు ఫైర్, డిన్నర్ ఏర్పాటు చేస్తారు. పర్యాటకుల బస కోసం ప్రత్యేకంగా గుడారాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం సఫారీ, బర్డ్ వాచింగ్, అల్పాహారం, చెరువులు, వృక్షజాలాలు చూపించి లంచ్ అనంతరం పంపిస్తారు.


క్యాంపుఫైర్ చుట్టూ సందర్శకులు

రెండవ ప్యాకేజీ: శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు గడిపిన పర్యాటకులకు పెద్దలకు రూ.2500, పిల్లలకు రూ.1500 చెల్లించాలి.

మూడవ ప్యాకేజీ: శనివారం 6 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు ఉండేవారికి 10 మంది ఉంటే రూ.600 లేకుంటే ఒక్కొక్కరికి రూ.1000, పిల్లలకు రూ. 300 చెల్లించాలి.

నాలుగవ ప్యాకేజీ: పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సఫారీ ద్వారా అటవీ ప్రాంతాలను చూపిస్తారు. ఇవి కాకుండా కవ్వాల్ అభయారణ్యం వెళ్లాలనుకుంటే పది మందికి రూ. 1500 చెల్లించాల్సి ఉంటుంది. కెమెరా సౌకర్యం కావాలనుకుంటే రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. www. turkamcheruvuaquawings. com వెబ్‌సైట్‌లో పర్యాటకులు బుకింగ్ చేసుకోవచ్చు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం



తుర్కం, వెంగన్న చెరువులు ఏకో టూరిజం సర్క్యూట్‌లో భాగంగా పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. వారందరికి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్వో, దిమ్మదుర్తి

మళ్లీ సందర్శకులకు సఫారీ


పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన సఫారీ

గతనెలలో వర్షాల కారణంగా ఎకో టూరిజం సందర్శనలు నిలిపివేశారు. వర్షాలు తగ్గడంతో మళ్లీ సందర్శకులకు సఫారీకి అటవీ శాఖ అవకాశం కల్పిస్తోంది. చిన్నారులకు రూ.10 టికెట్, 13 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి రూ.20 టికెట్ ఉంటుంది. 10 మంది కలిసి సఫారీ కోసం రూ.వెయ్యి చెల్లించి రెండు చెరువుల అందాలను చూడొచ్చు.



తుర్కం, వెంగన్న చెరువుల వద్ద పక్షులు

పోరాటయోధుడు సూరు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా కుమురం సూరు వర్ధంతి

ఉట్నూర్‌రూరల్: పోరాటయోధుడు సూరు అని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా కొనియాడారు. మండలంలోని కొలాంగూడలో కుమురం సూరు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ సభ్యులు నిర్వహించిన వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ముందుగా కుమురం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం కుమురం భీమ్‌తో కలిసి పోరాడిన యోధుడు కుమురం సూరు అని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఆదివాసీ, కొలాం మహిళల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు రాగి లడ్డూ అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా అందిస్తున్న యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్మన్ ఈశ్వరిబాయి, రాష్ట్ర అధ్యక్షులు వసంత్, కడప సోనేరావు, పీవీటీజీ ఆదివాసీ రాష్ట్ర ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కుడిమేత తిరుపతి, బొంత ఆశారెడ్డి, భీమ్‌రావు, కడప బాపురావు, కుమ్మర రాజు, మడవి రాజేశ్వర్, నిర్వహణ కమిటీ సభ్యులు, కళాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

36 గంజాయి మొక్కలు స్వాధీనం

- ముగ్గురిపై కేసు

ఆసిఫాబాద్: జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన సిర్పూర్(యు), జైనూర్‌లో శుక్రవారం 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..సిర్పూర్(యు) మండలం బాబ్జిపేట పంచాయతీ పరిధిలో 32, జైనూర్ మండలం మాన్కుగూడలో 4 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిర్పూర్(యు) పరిధిలోని గుట్టగూడకు చెందిన పెందూర్ భీమ్‌రావు, కొత్తగూడకు చెందిన కొబాడ చిత్రు, బాబ్జిపేటకు చెందిన కనక లింబారావుల వద్ద గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. జైనూర్ మండలం మాన్కుగూడకు చెందిన మడావి శ్యాంరావు పత్తి చేనులో 4 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. ఇందులో లింబారావు పరారీలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు, నిల్వ, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి గురించి సమాచారం తెలిస్తే డయల్ 100, 8712670551కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎస్సైలు రామకృష్ణ, రవికుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

పినాయిల్ తాగిన విద్యార్థిని

- రిమ్స్‌కు తరలించిన ఉపాధ్యాయులు
- చికిత్స పొందుతున్న విద్యార్థిని
- ఉమ్రి ఆశ్రమ పాఠశాలలో ఘటన

తలమడుగు: ఓ విద్యార్థిని పినాయిల్ తాగి పడిపోయిన ఘటన మండలంలోని ఉమ్రి ఆశ్రమ బాలికల పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థిని(15) దుస్తుల కోసం తల్లిదండ్రులను డబ్బులు అడిగింది. వారు ఇవ్వకపోవడంతో ఏడ్చుకుంటూ పాఠశాలకు వచ్చింది. గురువారం రాత్రి బాత్రూంలోకి వెళ్లి పినాయిల్ తాగింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ఆటోలో పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించగా చికిత్స పొందుతుంది. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు రిమ్స్‌కు చేరుకున్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహం తనిఖీ

మంచిర్యాలఅర్బన్: జిల్లాకేంద్రంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహాన్ని శుక్రవారం ఎస్సీ డీడీ చాతరాజుల దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనఖీ చేశారు. వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్‌రూంలో సరుకులు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులు, క్రీడల్లో రాణించి ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యత పరిశుభ్రత పాటించాలని వసతి గృహ సిబ్బందికి ఆదేశించారు. వసతిగృహ సంక్షేమాధికారి కుమారస్వామి ఉన్నారు.


వస్తువుల నాణ్యతను పరిశీలిస్తున్న దుర్గాప్రసాద్

ఏజీపీగా న్యాయవాది శ్రీనివాస్ నియామకం

బెల్లంపల్లి: బెల్లంపల్లి న్యాయవాది సీ.హెచ్. శ్రీనివాస్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జె.ముఖేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంకెం శివకుమార్, చేను రవికుమార్, న్యాయవాదులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో మూడేళ్ల పాటు ఏజీపీగా కొనసాగుతారు. సీనియర్ న్యాయవాదులు టి.గోపికిషన్ సింగ్, బాలకిషన్, ఎల్.రాము, సింగతి రాజేష్, సునీల్ యాదవ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగులకు టోకరా

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి డబ్బులు వసూళ్లు చేసిన ప్రభుత్వ బోథ్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..అనంతా సొల్యూషన్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగం ఇప్పిస్తానని 45 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల్లో దాదాపు రూ.40 లక్షల వరకు వసూళ్లు చేశారు. ఆదిలాబాద్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన ఓ నిరుద్యోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

ఫైలేరియా టాస్ వన్ సర్వే పర్యవేక్షణ

పాతమంచిర్యాల: ఫైలేరియా (బోదకాలు) నియంత్రణలో భాగంగా నిర్వహిస్తున్న టాస్ వన్ సర్వేను ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ సందాన్ శుక్రవారం పర్యవేక్షించారు. జిల్లాలోని రాజీవ్‌నగర్ యూపీ పీహెచ్‌సీ పరిధిలో టీమ్‌లు సర్వే చేస్తున్నాయి. జిల్లాలో 20 టీమ్‌ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని ఇప్పటివరకు 3300 మందికి బోదకాలు పరీక్షలు నిర్వహించామన్నారు. సర్వేపై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని పరీక్షలు ఎందుకు చేస్తున్నామో వివరించాలన్నారు. డీఎంహెచ్‌వో అనిత, మలేరియా సబ్ యూనిట్ అధికారి సంతోష్, మలేరియా టెక్నికల్ అధికారులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన పలువురు వాహనదారులను బెదిరింపులకు గురిచేసి డబ్బులు వసూళ్లు చేస్తున్న నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రతీరోజు లాండసాంగ్వి గ్రామం మీదుగా వాహనాల రాకపోకలు జరుగుతాయి. గ్రామానికి చెందిన దుమ్మని రాములు, మేకల సాయి, కోటే స్వామి, ఎస్.దత్తులు.. వాహనదారులను ఆపి బెదిరించి డబ్బులు వసూళ్లు చేశారు. వాహనదారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఎలుగుబంటి.. ఐడియా అదుర్స్

జన్నారం: ఊరూవాడ, గ్రామాలు, మండలాల్లో కోతుల గుంపుతో జనం పరేషాన్ అవుతున్నారు. వీటి బెడద నివారణకు కొత్త ఐడియా ఆలోచించారు ధర్మారం గ్రామానికి చెందిన లక్ష్మణ్. జన్నారం, ధర్మారం గ్రామాల్లో ఎలుగుబంటి వేషధారణతో కోతుల ఉన్న చోటికి వెళ్లగా, అవి పారిపోతున్నాయి. అవి ఎక్కడ ఉన్న సమాచారం ఇస్తే ఆయన ఎలుగుబంటి వేషధారణతో అక్కడికి వెళ్లి వాటిని తరిమేస్తున్నాడు. నిజమైన ఎలుగుబంటిగా భావించి దూరంగా పారిపోతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ ఐడియా కోతులతో బాధలను తప్పించింది.



కొండెంగల ఫ్లెక్సీ..కోతులకు చెక్

తాండూర్: గ్రామాల్లో కోతుల సంచారంతో ఇటీవల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీటి నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. తాండూర్ మండలం సింగరేణి ప్రాంతమైన మాదారం టౌన్‌షిప్‌లో కొండెంగల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద పార్కులు, కోదండరామాలయం, భూలక్ష్మీ ఆలయంతోపాటు రద్దీ ప్రదేశాల్లో డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి కొండెంగల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో గ్రామంలో ప్రతిచోట ఏర్పాటు చేయనున్నారు.



దండారీ సంబురాలు


కాకోను దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల ఆదివాసీల ఆరాధ్య దైవం శ్రీపద్మల్‌పురి కాకో ఆలయం వద్ద దండారీ సంబురాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి కాకోను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి కుటుంబ సమేతంగా కాకోను దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి కోళ్లు, మేకలు బలిచ్చి అక్కడే వంటలు చేసుకుని పంక్తి భోజనాలు చేశారు. అమ్మవారికి పప్పుగారెలను తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. గుస్సాడీల నృత్యాలు, డప్పుల దరువులు, కోలాటాల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దండారీ ఉత్సవాల సందర్భంగా రకరకాల దుకాణాలు వెలిశాయి. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పది

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటన్నింటిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గుస్సాడీ దర్బార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధిని గురించి, స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆదివాసీ సంఘాల రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.


దర్బార్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ తిరుపతి


గుస్సాడీల నృత్యాలు

‘నిందితులను కాపాడుతున్న ఎమ్మెల్యే’

బెల్లంపల్లి: వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులను పోలీసులు అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధుకర్ ఆత్మహత్యకు బాధ్యులైన అధికార కాంగ్రెస్ నాయకులు రుద్రభట్ల సంతోష్‌కుమార్ తదితరులను అరెస్టు చేయకుండా పోలీసులు నాన్చుడు ధోరణిని అనుసరిస్తున్నారని విమర్శించారు. నిందితులను ఎమ్మెల్యే వినోద్ హైదరాబాద్‌లోని తన ఫామ్‌హౌజ్‌లో ఉంచి అరెస్టు కాకుండా కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సై కోటేశ్వర్‌ను కాపాడటానికి పోలీసు అధికారులు ఫిర్యాదు తీసుకోవడం లేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నిందితులను అరెస్టు చేయకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు పులగం తిరుపతి, గోవర్ధన్, శ్రవణ్‌కుమార్, నవీన్‌కుమార్, నర్సింగ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో పట్టుపురుగుల సాగు చేయొద్దు

భీమిని: అనధికారికంగా అటవీ భూముల్లో పట్టు పురుగుల సాగు చేయొద్దని కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్, లింగాల ఎఫ్‌బీవో రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలం లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో పట్టు పురుగులు సాగు చేస్తున్న గిరిజన రైతులతో మాట్లాడి అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూముల్లోని చెట్లపై పట్టు పురుగులు సాగు చేయవద్దని సూచించారు. ఉన్నత అధికారుల నుంచి అటవీ భూముల్లో సాగుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు లేవని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అటవీ భూముల్లో పట్టు సాగు చేస్తే అటవీశాఖ పరంగా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


లింగాల గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మందమర్రిరూరల్: మందమర్రి శివారు మేడారం జాతీయ రహదారికి కూతవేటు దూరంలో 364 సర్వే నంబర్‌లో 1.30 ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ కోరారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమిలో కొందరు రియల్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయించగా అక్కడ నిర్మాణాలు కూడా జరిగాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు నాగుల కిరణ్‌బాబు, దాగం శ్రీనివాస్ ఉన్నారు.


జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

సాక్షి ఫ్యామిలీ

కరీంనగర్
శనివారం ॥ 18-10-2025

దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ. దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం... భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ఫ్లస్' కిడ్స్ ఈపేపర్‌లో



యువ హవా

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే
విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే
విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..


అవంతిక సరోగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరోగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసిఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసిఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మీనా మార్గరెట్

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలుదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.


నీతూ యాదవ్ – కీర్తి జాంగ్ర

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్ర, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

వంటిల్లు

తియ్యాటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... ''ఇనుములో ఓ హృదయం మొలిచెలే'' పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్రవిచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బ్రహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టుపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివూ, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్

ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు.

'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు.

వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది.

ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా?

యస్!

'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా..,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

బులియన్

బంగారం 10 గ్రా.: వెండి కిలో
అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,34,990	1,35,150	1,32,770	1,35,150	1,32,500	1,33,090
బంగారం (22 క్యారెట్లు)	1,24,590	1,21,700	1,21,700	1,25,350	1,21,900	1,22,000
వెండి	1,90,000	1,81,000	2,03,000	1,81,000	1,81,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.